

# క్రొత్తపల్లి సూర్యారావు గారు

(వెనుకటిసంచిక తరువాయి)

ఒక్కనాఁడు మానాయన చూడవచ్చినాఁడు. వియ్యంకు నడిగి నన్నుఁ దమయింటికిఁ దీసికొని వెళ్లినాఁడు. పదిదినము లట్టే పెట్టుకొనినాఁడు—అక్కడ నిది యే గొడవ—వచ్చువారు, పోవువారు; వచ్చియుండినవారింటికిఁ దిరుగఁ జూడఁబోవుట—మమ్ముఁ జూచి యానందించువారు, దీవించువారు. సుబ్బి పిన్నిగారియింటి కొకొక్కప్పుడు వెళ్లువారము. "బుద్ధిమంతుఁడు, అల్లుఁడు—మంచివారి కెక్కడ నున్నను గౌరవముగాఁ గడచిపోవును. శాస్త్రిగారికుమారుఁడు బుద్ధిమంతుఁడు కాకేమి" యని పలువు రానందించువారు. మాలచ్చి మగనితో నన్నుఁ జూడ వచ్చును. గౌరిని, శంకరుని, మీరు 'రావలసినది, మేము వెళ్లుచున్నా' మని యుత్తరము వ్రాసినది. వారిద్దఱు వీరిద్దఱు వచ్చినారు. నాల్గుదినము లున్నతర్వాత—మాయింటికి ముందురమ్మని మాయింటికి ముందు రమ్మని నన్నుఁగూర్చి—వారిద్దఱు పట్టుపట్టువారు. ఎవ్వరిమీఁద నెక్కుడు దయగలదో వారియింటికి నీవు ముందు వత్తువు అని వారు నన్ను మాటలాడనీకుండఁ జేయువారు. మీయిద్దఱిమీఁదను నాకు సమాన ప్రేమయే, సమాన దయయే—ఏక కాలమందు మీయిద్దఱియిండ్లకు నే నొక్కతె నెట్లు వత్తును. కాఁబట్టి మీరిరువురు నాయొద్దనే యుండుట మంచిదనియు, లేదా, మన మందఱము ముందొక్కరింటికి వెళ్లి యక్కడ నాలుగునాళ్లుండి మఱియొకచోటికి నందఱము వెళ్లుదమని సమాధానము చెప్పితిని. అక్కయ్యా, నీకథలు విని, నీతో నుండి చాలనాళ్లయినది—అని లచ్చి, గౌరి మీఁదఁబడి ప్రాఁకువారు—నేనవ్వుచు మీ రివ్వరే, మీకేమి పెత్తన మున్నదే నన్ను మీయింటికి రమ్మనుటకు—మీ మగ లూరకున్నారు. మీరు పిలిచిన నే నెట్లువత్తును—మీ రొకరిచేతిక్రిందివారు—మీ మగలెక్కడికి రమ్మనిన నక్కడకువత్తును—ఏమి లక్ష్మీనారాయణా! శంకరదీక్షితులు! మీయిద్దఱిలో నెవ్వరియింటికి ముందుగా రమ్మనియెదరు? అని వారివంకఁ జూచితిని. వా రొకరినొకరు చూచుకొని—యేమియు ననలేక, మీయిష్టము, మీ కెవ్వరియింటికి రావలయుననియున్న వారియింటికి రండనిరి. "మీరుమీరని మాటలాడుచున్నారు! మీరు "గురువుగారినిబట్టి మిమ్ము మేము గౌరవింపవలసినదే." "గురువుగారిని బట్టి గౌరవముచేయుట కధికారము నాకు లేదా—నేనిప్పటికి మీకుఁ గోపము వచ్చినను సరియై లచ్చి, గౌరి యనియే పిలిచెదను." "అట్లే పిలువవలయును—మమ్ముఁ గూడ గౌరవింప నక్కఱలేదు." "మఱి యెవ్వరియింటికి ముందు రమ్మందురో చెప్పరేమి" - "మాకుఁ దెలియదు, మామాటమీఁద రాఁదలఁచితిరా! మాయిద్దఱిలో ముం దెవ్వరి నెఱుఁగుదురో వారియింటికి ముందు వచ్చుట న్యాయము."

ఈమాటలతో లక్ష్మీనారాయణ మాయింటికిఁ జదువుకొనవచ్చినవారిలో మొదటివాఁడగుటచే లచ్చితో

ముందు వెళ్లవలసివచ్చినది-గౌరి, "అట్లుకాదు, దూరభారము లాలోచింపుము-ఎవ్వరియూరు దూరముగా నున్నదో వారి యూరు ముందు వచ్చుట న్యాయము-" లచ్చి-"మా యూరు పిఠాపురముకంటె దగ్గఱ" యనియెను. "ఎప్పుడు రమ్మని యుత్తరము వచ్చునో-వచ్చినతర్వాత తొందరపడవలయును-ముందొక్కసారి దగ్గఱయూరు వెళ్లి-తర్వాత పిఠాపురము వెళ్లియుంటివా దారిలోనున్నదిగనుక పిఠాపురములోనే రైలెక్కి వెళ్లవచ్చు" నని మానాన్న తుదితగవు చేసెను. అట్లే కావించితిని. వారివారి యిండ్లకడ, వారువారుచేయుచున్న పనులు, చేయించి కొన్న నగలు, మొదలైనవి చెప్పిచూపి-కొన్నినాళ్లు నాకానందము గల్గించిరి. నాకన్నిటికంటె మిక్కిలియైన యానందమే మనఁగాఁ దాము పెంచి పెండ్లిండ్లుచేసిన మేము ముగ్గుర మిట్లుండుట చూచుటకు మాతల్లిదండ్రు లింతకాలము జీవించియుండుట-నాకత్తమామలిద్దఱు, ఒక్కదానికత్తగారు, నొక్కదానికి మామగారును దీర్ఘాయుష్కులై యుండుట - లచ్చికొక్కకూఁతురు, మాకుఱ్ఱవానికంటెఁ జిన్నది. గౌరి కొక్కకొడుకు, మాకుఱ్ఱవానికంటెఁ బెద్ద వాఁడు.

మావారు విశాఖపట్టనము వెళ్లినతర్వాత-వాల్తేరు తమకసౌకర్యముగా నున్నదనియు-బరంపురము మార్పు చేయించికొంటిననియు-లక్ష్మీనారాయణనో దీక్షితినో యిచ్చి తిన్నఁగాఁ బిఠాపురములో రైలెక్కించి బరంపురము పిల్లలను బంపవలసినదనియుఁ దండ్రిగారి పేర వ్రాసిరి. వారు మాతండ్రిగారి పేర వ్రాసిరి. మాతండ్రిగారు పిఠాపురము వ్రాసిరి. మేము ప్రయాణమగునప్పటికి-విడువఁజాలక, మానాన్నగారు, మామగారును బిఠాపురము వచ్చినారు. "మేము చూడఁబోయిన ముసలివారము; నీవు చూడఁబోయిన జబ్బుదానవై పోయితివి. ఎట్లో తెలిపిచేసికొని దేశమునకువచ్చు నుపాయము చూచికొనుండు. హాయిగా నున్నవారిని గదలిరమ్మనుచున్నామని మఱియొకలాగున భావింపవలదు" అని నాతోఁ బలికిరి. "జరుగనిండు కొన్నినాళ్లు: మాకెప్పు డిబ్బందిగానుండునో యప్పుడు రానేవచ్చెదము - అక్కడ మన కెవ్వరున్నారు. నేనక్కడకు వెళ్లి యుత్తరము వ్రాయించెద" నని నచ్చఁజెప్పి బరంపురము వెళ్లితిని.

బరంపురము మంచియూరే. మావారికిఁ గాకినాడ రాజమహేంద్రవరము. బంధువుల కూఁతుండ్రు, కోడండ్రు నక్కడ నున్నారు. వారి సంబంధమునుబట్టి నేనప్పుడప్పుడు వెళ్లి చూచుచుండెడుదానను. ఈయైదారునెలలలో మాశాస్త్రి చదువు వెనుకఁబడినది. నాకారోగ్యముగానే యున్నది. ఏదో యింత వండిపెట్టి తిరుగుచున్నదానను. కొంచెము యాలోచనమీఁద మావానిని పెద్దచదువులకని యత్నింపనే లేదు-చదువులలో శ్రమ-ఇప్పటివారికి గాఢముగాఁ జదివిన నజీర్ణము పుట్టును. చదువులు భరింపవు. రైలుస్కూలులోవేసి నాలుగుముక్కలు మాటలాడుట-మణుగులు సేరులు, రూపాయలు అణాలు లెక్కలు కట్టుట-టక్కుటిక్కుమని తీగటపా నడపుట - మనకుఱ్ఱవానికే స్టేషనులోనయిన నిరువదిరూపాయలు దొరకకపోవునా యని యూహించితిమి. రైలుద్యోగము చక్కనిది. గౌరవమునకు గౌరవము-హాయికి హాయి-డబ్బునకు డబ్బు. ఇతరకార్యాలయములలోవలె నింతంత పక్షపాతము పెద్దవారిలోఁ దక్కువ. ఎవ్వరి పని వారు చేసికొనిపోవుటయే-కడుపులోని చల్ల కదలకుండఁ గూర్చుండుట కుపాయము.

మన మేమి యెక్కువ చదువులు చదివినారము. అదృష్టము చెప్పిచెప్పిరాదు. ఎక్కుడుచదువు చదివి వీఁడు కలక్టరు కాఁబోవునా, మనము చూచెదమా! "అవశ్యం పితురాచార" మన్నారు. నాలాగున్న జాలు నని మావారు నాతోఁ జెప్పిరి. అంతబొత్తిగ నిరక్షరకుక్షి గాఁడు - వానిప్రాణమునకుఁ దగిన చదువువాఁడును జదువుచున్నాఁడు. చుఱుకైనవాఁడే. పాపము! చదువుచునేయున్నాఁడు. ఆఁడుపిల్లలకుఁ జదువేమిటి యను వారిలోని దాననే నేను. చదువనఁగా నైదుబడులు, గుణితము, కాకికుక్కబొమ్మలు, చాఁపల్లుట, బుట్టలు, తట్టలు, ఊలుకుట్లు-నిదియా! దీనికై యాఁటితేఱిన పంతులమ్మలు గావలయునఁట. ఒక్కముక్క వ్రాయలేరు. ఒక్కపద్యమున కర్థము చెప్పలేరు. దీనికై శిక్షితలైన పంతులమ్మలేకాని బాలికలకుఁ జదువుచెప్పుటకు నాలుగుముక్కలువచ్చిన మగవారు పనికిరారఁట - చదువుమాని యింటనేయుండిన యొక్కబాలిక-బియ్యము చేఁటలోఁ బోసి చెఱుగలేదు. కడిగి వాడ వెయ్యలేదు. చెంబులు తోలఁచుట చేతఁగాదు. బియ్యములోని పెడ్డలేఱలేదు.

పంతులమ్మకే చేతఁగాదు. ఏబాలిక యింటికివచ్చి తన యింటికిఁ గావలసిన మేజోళ్లల్లినది. చాఁపలు నేసినది. బుట్టలల్లినది! "మహాజనో యేన గత స్సపంథా" అని - మాపిల్లమాత్ర మెక్కడఁ బుట్టినది! అల్లే చదువుచున్నది. శాస్త్రీమాత్రము కొంచెము దారిఁ బడినాఁడు. తల్లిదండ్రు లింటియొద్దఁ జెప్పు చదువు గడచి పెద్దచదువులోనే పడినాఁడు. ఇప్పటి వానిపాఠములు లెక్కలు మాకర్థము కావు.

## పదునెనిమిదవ యంకురము

ఒకరింగాంచిన నోకరి కసూయ యెందునుం[?]లదు–నాకుఁ బదిరూపాయలుజీతము, వానికిఁ బదేనేల యని నాకంటె వాఁడేమిపెద్దయని–ఏమిబుద్ధిశాలియని. ఏమిపనివాఁడని–యుండును. ఇదియొక చిత్రము. నేను దినమెల్ల వ్రాసిపెట్టిన కాగితములమీఁద నొక్కచేవ్రాలు చేయుట కీయనకింత జీతమేల యనువానికిఁ దనకంటెవానికెంత జాగ్రత్త యుండవలయునో యన్నది తానును దైవవశమున నంతవాఁ డగుదాఁక దెలియదు. సాధారణముగా యజమానునకుఁ గ్రిందివానిం బరీక్షింపవలయును, దప్పులు పట్టవలయుననియే యుండును. దొరకుపడకుండఁ దప్పుకొనవలయునను నూహతోపాటు, మన మెట్లు తప్పు వ్రాసిననేమి దిద్దుకొనువాఁడుగదా యధికారి యనుదు రూహ చాలమంది కుండును. తన కేమైనఁ గాలిలోముల్లు గ్రుచ్చుకొన్నను నది తనకష్టసుఖములెఱుఁగని యధికారిమూలముననే వచ్చినదని భావించువారు కొందఱు. ఈ విషయమై యెత్తిచెప్పఁ దలఁచితినా యీయంకురమంతయేకాదుగదా యీ యానందకందమంతయు నగును– ఈక్రిందివింత వినిన మీకు లోకములో నసూయ యెన్నివిధములో–అందులో నిది యెన్నవదో గ్రహింపఁగలరు. మావారు సెలవుపుచ్చుకొన్నదే కాని మరలఁ బనిలోఁ బ్రవేశించినది యెఱుఁగని యొక్క తంత్రీవార్తానిర్వాహకుఁడు తనప్రక్కస్టేషనులోనున్న యింకొక టెలిగ్రాపు సిగ్నలరుకు, రైలు రాకపోకలులేక చాలవ్యవధిగానున్న సమయములోఁ దంతికొట్టినాఁడు. గ్రహచారవశమున నపుడు స్టేషనులో నతఁడు లేకుండుటయు, మావారుండుటయుఁ దటస్థించినది. అతఁడు గణగణగంట వాయించినాఁడు–చాలసే పెవ్వరును బలుకలేదు. మావారు వెళ్లి గదిలో నిలిచి యేమియని యడుగఁబోవునప్పటికి సిగ్నలరు వచ్చి–ఎవ్వరు ఏమని యడిగెను.

మొదటివాఁడు——(మావారి యుద్యోగముతోఁ జెప్పి) పనిలోఁ బ్రవేశించినాఁడా (అనియడిగెను.)

రెండవవాఁడు——దగ్గఱనే మావారుండుటచేఁ జేయివడఁకి–టక్కుటిక్కుమని కొట్టుచుండఁగా–ఏమియది, యెవ్వరాయడుగువారని తామే యక్కడఁ గూర్చుండి–నీ కేమిపని వానితో–ఇంకను సెలవులోనే యున్నాఁడు, సెలవు పొడిగించుకొన్నాఁడఁట–నీవేమైనఁ జెప్పుకొనవలసియున్నదాయని యడిగిరఁట–టెలిఫోనులోవలె నిందు కంఠధ్వని తెలియదుగదా! అందుచే, వాఁడు,–ఆతఁడు కష్టసుఖము లెఱుఁగని కఠినుఁడు, విద్యావంతుఁడు గాఁడు. అదృష్టముకొలఁది నిట్టియధికారము వచ్చినది–ఆగర్వముచే మావంటివారిని బాధించుచున్నాఁడు: ముఖ్యముగా నేననిన నాతనికిఁ గోపము–నాకంటె వెనుక వచ్చినవానికిఁ బెద్దపని యిప్పించినాఁడు, నన్ను మూలఁబడవైచినాఁడు. ఎవ్వరికిఁ జెప్పుకోవలసినను వీనిమూలమునఁ గదా పోవలయును; నేను వ్రాసికొన్న కాగితములన్నియు బుట్టలోఁ బడవేయును. అని తనయసూయ వెడలఁ గ్రక్కుకొనుచుండెను. నీవేమయిన నాశపెట్టి చూడలేకపోయినావా! అని మావారు——

ఆతఁడట్టివాఁడైనయెడల నింతసేపా! దమ్మిడి ముట్టఁడు. అట్లయిన ఆలాగువచ్చినది యీలాగు వానికర్పింతును. నాకెంత లేదన్నను జీతముకంటెఁ గొంచెమెచ్చుగానే దొరకుచున్నది. పుచ్చుకొని యుపకారము చేయు బుద్ధియు నాతనికి లేదు.

అని ప్రత్యుత్తర మిచ్చినతర్వాత, సరేలే, నాకింటియొద్దఁ బనియున్నది. "శ్రీ అప్పు" వచ్చులోపల నేనొకసారి యంగడికిఁ బోయి వచ్చెదను. వీలయినచో సాయంకాలము నేను నిన్నుఁ గలసికొందునని మావారు మర్మముగా నన్నిమాటలును, జ్ఞాపకముగ వ్రాసికొనిరి. అక్కడి యుద్యోగితో, నీ వీతనితో మైత్రిగలిగి యున్నాఁడవా, మీలో మీరిట్లు స్వవిషయములు చెప్పుకొనుచుందురా–ఈసంగతి నీవు వానికిఁ దెలిపినయెడల నీకుఁ జాలనష్టము గలుగును. జాగ్రత్తగా నుండుమని బెదరించి ట్రాలీబండి

మీఁదనే సాయంత్రము పై స్టేషనుకు వెళ్లిరి. మా వారిని జూడఁగనే పాప మాతని గుండెలో రాయిపడినది. ఎఱుఁగనట్లు నటించుచుఁ గొంతసేపుండి క్రమక్రమముగా మాటలలోనికి దింపి స్టేషను మేష్టరును బిలిచి దగ్గఱ నిలిపి జరిగినదంతయుఁ జెప్పి, యిట్లు నీవు నీప్రక్క స్టేషనుకుఁ దంతి కొట్టినావా లేదా. కొట్టినట్లయినఁ గొట్టినానని నాకు వ్రాసియిమ్ము. పైకిఁ బంపవలయును. నీ పెద్దతనమంతయు నీమాటలలోనే యుండఁగా నీకు నేనెట్లుపకారము చేయఁగలను. నీకంటె నిటీవల వచ్చినవాఁ డెట్టివాఁడో నీ వెట్టివాఁడవో తెలియుట లేదా. నీవే యదృష్టవంతుఁడవు. ఎఱిఁగియుండియు నిన్ను నేనేమియుఁ జేయలేదు. నావలన నీ కుపకారమే జరిగినదిగా నెంచుము. నీవు టిక్కెట్టుకలెక్టరుగా నున్నాఁడవు. సిగ్నలరుగా వచ్చుట యెట్లో యెఱుఁగుదువా! నేనా నాఁడు లేకున్న నీవింకను దానిలోనే పడియుందువు. నీవు నాకంటె విద్యాధికుఁడవు గావచ్చును. బుద్ధిమంతుఁడవే కావచ్చును. నీవును మంచిచెడ్డ లెఱిఁగినవాఁడవే. నేనాశగలవాఁడను గానని చక్కఁగా గ్రహింపఁగలిగితివి. కాని యిట్టి యుల్లుపట్టుమాటలు నీకుఁ మంచిదికాదని-నిర్హేతుక నిర్వేదమని యెఱుఁగకున్నవాఁడవు. అని చెప్పి స్టేషను మేష్టరుగారితో మీరీతనిని మూఁడు మాసములు పరీక్షింపవలయును. తర్వాత నేమి చెప్పెదరో చూచి యాలోచించెదను వీనిని బాగుచేయవలయునన్నను, బాడుచేయవలయునన్నను మీచేతిలో నున్నది గాని నాలో నేమియు లేదు. నేనీతనికిఁ జేసినయపకారమేదో మీరు నేను లేనియపుడు వీని నడిగి చక్కఁగాఁ దెలిసికొనుఁడు. అని భయపెట్టినారఁట - ఈప్రసంగము కొందఱకు నానాఁటఁ దెలిసినదిగావున దుష్టబుద్ధులు కవలక మెదలక మావారి చేతిక్రిందనున్న స్టేషనులలోని వారు గడగడలాడఁ జొచ్చిరి.

నిష్కారణముగా నిట్టినిందలువేయు దుర్బుద్ధులు లోకమునం దుండఁగా మంచివారికి గతిమోక్షము లుండునా. పాప మామనుష్యుఁడు తనతోడివారికందఱకు నిది తెలిసెనని తెల్లమొగము వేసికొని లంచపంచములు తలపెట్టక, ప్రయాణికులను బాధింపక భద్రముగా నుండఁ జొచ్చెను. మాకు రెండుసంవత్సరములలో బరంపురము నుండి మార్పు జరిగినది. ఒక్కతావులోఁ గ్రొత్తస్టేషను పెట్టవలయునని గ్రామములవారు వ్రాసికొనిరి. అక్కడ స్టేషనువలన లాభమేయని మావారు పైకిఁ దెలియఁజేసి పని ప్రారంభించిరి. ఇంతలో మా ప్రయాణము సమీపించినది. వెళ్లఁబోవుచుండఁగా - మన సిగ్నలరుగారి మాట తలంపునకు వచ్చి క్రొత్తస్టేషనులో వీరికి మేష్టరుపని యీవచ్చునని-అర్హుఁడని వ్రాసిపోయిరి. తమకు మాఱుగా వచ్చిన యుద్యోగితో నతని నొకకంటఁ జూచుచుండుఁడని స్నేహమును, వైరమును గాని తెఱంగునఁ జెప్పియుండిరి.

క్రొత్తగా వచ్చినవారును—ఆతఁడు భయభక్తులతోఁ బనిచేయునట్లును క్రొత్తగా నిలుపఁబడిన స్టేషనులో, జనసౌకర్యముల నాలోచించుచుఁ బ్రయాణికుల నలజడిపెట్టక వర్తకులఁ జిక్కుపఱుపక కంపెనీకి లాభము కనఁబఱిచినయెడల, సుద్యోగము స్థిరపడునని యును, లాభము కనఁబడనిచో స్టేషను నెత్తివేయుదురనియు భయపెట్టిరి. ఆమాటమీఁదనే యతఁడు భయనయములతోఁ బనిచేసి జనులమెప్పును బడసి, యధికారులచే మంచివాఁ డనిపించుకొనియుండెను. ఈరీతిగా మావా రెందఱినో ముష్కరులను మంచిమార్గమునకుఁ దెచ్చిరి. కంపెనీవారును వీరిగుణములను దెలిసికొనిరి. ఇంతకంటె నేమి కావలయును. పట్టినదెల్ల బంగారమయ్యెనని- వీరేపనిలోఁ బ్రవేశించినను దానిని జక్కఁగా జరుగునట్లు కట్టుదిట్టములు చేసి స్థిరపఱుచువారు. పెద్దపెద్దదొరల స్నేహముగల బాబూలు కాపాడుచున్నారు. ఇప్పటికిని వారి దయ పూర్ణముగా నున్నది. రైలువే యధికారులందఱకుఁ దలలోని నాలుకవలె మెలంగుచున్నారు. వారందఱు నతివిశ్వాసముగలవాఁడు - కంపెనీకి మేలుచేయువాఁడని చెప్పఁదొడఁగిరి. ఇట్లొక యైదు సంవత్సరములు గడచినవి. బంగాళీబాబులు మాయొద్దనున్న మీదాపుడుధనము తీసికొనిపొమ్మని యుత్తరము వ్రాసిరి. ఇదేమి, యిట్లు వ్రాయుటకుఁ గతమేమియని యాలోచించి సెలవుపుచ్చుకొని వారియొద్దకి వెళ్లి యడిగిరి. తాము వృద్ధులమనియుఁ దనయులు విద్యాభ్యాసంగములోనుండి యీమార్గమునకు రారనియు, విశ్రాంతిగోరియున్నారము గావున నీసొమ్ము నీయొద్దకిఁ జేరుట మంచిదెయని యిచ్చివేసిరి. కాకినాడబ్యాంకిలోఁ బడవైచి

కొంటిమి-తర్వాత బాబుల స్వర్గగమనము, కుమారులు పంచుకొనుట వింటిమి.

కాలమొక్కరీతిగా నెవ్వరికిని గడువదు. మా యిరువురి యత్తమామలు వృద్ధులైరి. నేను దూరస్థలమం దుండుట వారి కెంతమాత్రము నిష్టము లేదు. రమ్మని వ్రాయఁ దొడఁగిరి. పుష్కరము రానున్నది. ముహూర్తములు లేవు. కుఱ్ఱవానికి వివాహము మాకన్నులతోఁ జూచి యానందింపఁ గోరుచున్నారమని వ్రాసిరి. పెద్దలకోర్కి దీర్పకుండుట న్యాయముగాదు. వారి కెంతకాలముందురు. ఎవ్వరు ముందో యెఱుఁగరాదు. శుభస్య శీఘ్రమన్నారని మరల మూఁడునెలలు సెలవు పెట్టి దేశమునకు వచ్చితిమి. పెద్దవారియూహ లెప్పుడును పెద్దయూహలే-ఏసంబంధము చేయవలయునని-చదువుకొన్నవాఁడా! యుద్యోగియా! పట్టుమని యిరువదియేండ్లయిన నున్నవా! ఎవ్వరు బిడ్డ నిచ్చెదరు! అని మే మాలోచించుకొనుచునే వచ్చినారము. ఎన్నియో క్రొత్తయాలోచనలు చేయుచుంటిమిగాని-ఒక్కనాఁడును మా కీయూహ తోఁపలేదు-వచ్చినతర్వాత క్రమముగా నెవ్వరియింటఁ బిల్లయున్నది. పెండ్లి చేయుట యెట్లని మాయత్తమామల నే నడిగితిని. వారియత్తమామలను వారును నడిగిరి. వెఱ్ఱివారా: వెదకికొననేల! మనయింటనే యున్నారని చెప్పిరి. అంతయును గూడఁబలుకుకొనియే మా కుత్తరము వ్రాసియుందురు. లచ్చికూఁతు రున్నదని చెప్పిరి. మనవానికి లచ్చికూఁతును జేసికొని, మనబిడ్డను గౌరికొడుకున కిచ్చిన బాగుగా నుండును. రెండువివాహములు నొక్క ముహూర్తముననే చేయవచ్చును. సంతోషమునకు సంతోషము, సౌఖ్యమునకు సౌఖ్యము-మనవాండ్రు మనయింటనే యుందురు. డబ్బు కలిసివచ్చును. ఒడిలోనిబిడ్డ లొడిలోనే యుందురు. అనిన పెద్దవారిమాటలు విని కొండెక్కినాము. లక్ష్మీనారాయణునకు దీక్షితునకు వ్రాసినాము. వారు వచ్చినారు. మాయూహ లిట్లున్నవని తెల్పినారము. వారు నమితానందము నొందిరి. ఎవ్వరిమట్టుకు వారికిఁ గొంచెమో గొప్పయో కలదు. ఒక్కరిపై నొక్కరాధారపడి యుండలేదు ఎవ్వ రేమేమి విశేషములు చూపినను, అవి యొక్కొక్కవిశేషము క్రిందనే యుండును - అందఱమును దబాస్తనుకొన్నారము.

రెండు వివాహములును మాయింటనే జరుగవలయునని మామామగారికి- మనుమరాలి వివాహము తమ యింటఁ జరుగవలయునని మానాయనగారికి-మానాయనగారి కన్నివిధముల మేముముగ్గురము సమానులమే. లక్ష్మీనారాయణుఁడు శంకరదీక్షితులు నిరువురుశిష్యులు-గురువుగా రెట్లు చెప్పినను దానికి మాఱుమాటయాడరు. కాని లచ్చికిఁ దనయింటికి మమ్ముఁ దరలిరమ్మని చెప్పవలయుననియున్నది. గౌరికి మాయింటికిఁ దరలిరావలయుననియున్నది. ఎందుకైనను పెద్దలయిష్టమని సమాధానపడియున్నారు కావునఁ బెద్దలయానందమునకుఁగాను మాయత్తవారియింటనే రెండు శుభకార్యములు జరుప నిశ్చయించినారు. శుభలేఖలు వ్రాసినారము. పందిళ్లు పాకలు వేసినారు. రెండుకళ్యాణములు సలక్షణముగా జరిగినవి. పెండ్లివెట్టులన్నియు నెవ్వరెఱుఁగనివి- వానివర్ణనము విశేషముగ వలదు.

మూఁడునెలల తరువాత, మరల నుద్యోగము మాట తలఁపునఁ బొటీనది. నాయనా నేను వృద్ధుఁడను. ఏవేళ కేమో, నీవు దూరదేశము వెళ్లుట నా కిష్టములేదు. నీవును జక్కఁగ నాలోచించుకొనుము- తర్వాత నీయిష్టము, నీపెండ్లమునిష్టము-ఆశకు మేరయెక్కడ! ఇంత వాఁడ వగుదు వని నేను గలలోను దలఁచుకొనలేదు. అయిదువ్రేళ్లును లోనికిఁ బోవును. మండ ములుగఁ గలదు. దైవ మింతదయఁ గనఁబఱిచెను. ఇప్పటి కందఱము సుఖులమై యున్నారము. అక్కడ మీయత్తమామలును, నాకంటెఁ జిన్నవారే కాని వారును డెబ్బదియవపడిలోనివారు. మీకింకను వడి మరలలేదు గావున నుద్యోగము చేయవలయుననియే యుండును. మీతో మమ్ముఁ గొనిపోవలయునని యుండునుగాని యీతురీయావస్థలో మాకుమాత్ర మిల్లువిడిచి పరస్థలములో నుండవలయునను తలంపు లేదు. పుట్టిపెరిగినయిల్లు కట్టకడపట విడుచుటకు మనస్కరింపదు. అని యెంతయో మా మామగారు కుమారునికిఁ బోధించిరి. వారికోరికకిఁ బ్రతిచెప్పఁజాలరైరి. సరియే యట్లే కానిండు. నేనొక్కసారి వెళ్లి యధికారులను జూచివచ్చెదను. అక్కడ వారితోఁ జెప్పి వ్యవహారము ముగించుకొని రావలయును. అని తమరుమాత్రము వెళ్లి, నేను బనిచాలించుకొందును. మాతల్లిదండ్రులు వృద్ధులు,

గృహకృత్యవ్యవహారములు చిక్కులుగొన్ని తీర్చుకొన వలసియున్నది. అని యతికష్టముమీఁద వారిని సమ్మతి పఱిచికొనిరి. కంపెనీయధికారి పెద్దదొర నింటియొద్దఁ జూడఁబోయిరి. నీకొమారుఁ డేమిచేయుచున్నాఁడని దొరగా రడిగిరి. ఇంకను జదువుచున్నాఁడు, వాఁ డెప్పటి కైన మీవాఁడేయని వీరు చెప్పిరి. ఇప్పుడే పంపరాదా యని దొరగారు కోరిరి. మా కేకపుత్రుఁడు, చిన్నతనము; దూరదేశములో విడిచియుండఁజాలము-పిమ్మట మీచిత్తము. అని వీరు సవినయముగఁ జెప్పిన-భయములే దిక్కడఁ గొంతకాలముండనిమ్ము. క్రమక్రమముగా దక్షిణ మహారాష్ట్రము కంపెనీవారికి వ్రాసి మీప్రాంతములోనే యుండునట్లు చేసెదను. అని సదయులై దొరగారు వచించిరి. మా శాస్త్రికిఁ గలకత్తాలో నుద్యోగము దొరికినది. అది దొరగారి సన్నిధినే-మేము మా పూర్వపరిచితులతో-భద్రముగా మావానిని జూచుచుండుఁడని చెప్పి, మహారాజు పెద్దదొరగారిచేతులోఁ బెట్టి వచ్చి యిక్కడ విశ్రాంతిఁ జెందియున్నారము. దొరలు, అందునను గొప్పయుద్యోగము గలవారు-వారి కెవ్వరిపైనఁగాని విశ్వాసము కలిగెనా యెన్నంటికిని దానికి భిన్నాభిప్రాయ ముండదు. తలంచుకొనిరా వాని నెంతవానినైన జేస్తురు. మావాఁ డక్కడఁ బ్రవేశించిన రెండేండ్లలో మూఁడుమెట్లెక్కినాఁడు. సదయహృదయులైన మాదొరగారును, మాపాలకులును, భగవంతుఁడును వ నిని మమ్మువలెనే పదికాలముల పాటు కటాక్షించుచుండుఁడు. మే మిక్కడ వృద్ధసంసేవనమునఁ గాలము గడపుచుందుము.



# సమర్పణము

శ్రీ వేంకటకాళిదాస కవులు

(ఆంధ్రగీర్వాణ సాహిత్య సమ్మేళనము)

వికచ మృదునవ్య పద్మినీ విమల మధుర
మధు రసప్రాయ గాన సంపదలలోన
బొటబొటం గారు కన్నీటిబొట్ల మంచి
ముత్తియమ్ముల ప్రోవులు పొల్చునేమొ!
వాని నన్నింటిఁ బ్రేమసూత్రానఁ గ్రుచ్చి
దేవదేవ! యాహారముం దీసికొనుము
లలిత జీవకళాసుధల జిలుకునట్టి
యమల గీతరహస్య భాగములలోనఁ
బ్రభలు వెలయించురత్నముల్ వరలునేమొ!
వానిలోపల స్ఫుటముగాఁ బ్రతిఫలించి
నీయనంతాద్భుతాకార నిచయమెల్లఁ
గనులకు వినోద మగునట్లు కనఁబరుపుము!

పరు లెఱుంగని యేకాంత భావ మొదవ
మాటిమాటికి నాపాడు పాటలోన
నెవ్వియుండిన నుండఁగా నిమ్ము నీవు
కైకొనిన నెవ్వి పూతము గాకపోవు?
విమలహృదయాన నీకు నర్పింతుఁ గానఁ
గోర్కెతో మంచి దంచుఁ గైకొమ్ము సామి!

—(ఏకాంత సంగీతము)